

Dr.G.Rajesh

CMD INB MEDIA GROUP

TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ: , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 03 సంచిక : 80 ఎడిటర్ : జి.రాజేష్ మంగళవారం 16 జూన్ 2026 పేజీలు : 6 వెల రూ. 4.00


# డిజిటల్ గవర్నెన్స్‌లోనూ గూగుల్ భాగస్వామ్యం

మిగతా 2లో

ఏపిలో పెట్టుబడులు పెట్టండి
ఏపీకి 1,000 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం
లాజిస్టిక్స్ పరంగా అనేక అనుకూలతలు
హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టివిటీ
ఆక్వాకల్చర్‌లో నంబర్ 1గా ఉన్న ఆంధ్రప్రదేశ్
ఏపిని సందర్శించండి..పెట్టుబడులు పెట్టండి
సింగపూర్‌లో ప్రముఖ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు భేటీ




- గూగుల్‌తో కలిసి పని చేసేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్
- ఏపీలో లాజిస్టిక్స్ పార్కులు... సప్లై చైన్ సిటీ నిర్మాణానికి విస్తృత అవకాశాలు
- యూఎన్ హాబిటాట్ సెంటరాఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఆహ్వానం
- సీఎం చంద్రబాబు

అమరావతి ఐఎన్‌బిటైమ్స్

ఏపీకి 1,000 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం ఉందని.. లాజిస్టిక్స్ పరంగా అనేక అనుకూలతలు ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టవిటీ ఉందని సీఎం చెప్పారు. లాజిస్టిక్స్ వ్యయం తగ్గించేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నామన్నారు. హార్టికల్చర్‌పై లక్ష కోట్లు ఇన్వెస్ట్ చేయబోతున్నామని.. ఆక్వాకల్చర్‌లో నంబర్ 1గా ఉన్నామని వివరించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా వివిధ ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వరుసగా సమావేశాలు నిర్వహించారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం వివరించారు. తొలిరోజు పర్యటనలో భాగంగా వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ నంబియార్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు

# విధ్వంసకర విధానాల నుంచి ఎక్సైజ్ రంగాన్ని గాడిలో పెట్టాం

- ప్రభుత్వ ఆదాయ వృద్ధి లక్ష్యంగా సమూల సంస్కరణలు
- రెండేళ్లలో ఎక్సైజ్ రంగంలో చారిత్రాత్మక మార్పులు సాధించాం
- రాష్ట్ర ఎక్సైజ్, గనులు డ భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- దేశంలోనే అతిపెద్దది మద్యం కుంభకోణం
- ఇందులో 50మందికి పైగా ముద్దాయిలు
- జగన్ ప్రధాన సూత్రధారి అంటూ మంత్రి రవీంద్ర విమర్శలు



మిగతా 2లో

# పవన్ కళ్యాణ్‌ను ఆడిస్తున్న బిజెపి

- బిజెపి కుట్రలో పావుగా మారిన పవన్
- ఇష్టం వచ్చినట్లు తెలంగాణపై మాట్లాడితే ఊరుకోం
- పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ హెచ్చరిక



2లో

# మైనార్టీ సంక్షేమాన్ని విస్మరించిన గొడ్డలి పార్టీ

- ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క పని చేయని జగన్
- మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ విమర్శ



అమరావతి,ఐఎన్‌బిటైమ్స్

గొడ్డలి పార్టీ హయాంలో మైనార్టీ సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల బిడ్డలు డీఎస్సీ ద్వారా టీచర్లుగా ఉద్యోగాలు సాధిస్తే వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు కడుపు మంటగా ఉందన్నారు. కుంభకర్ణుడిలా 9 నెలలు నిద్రపోయి ఇప్పుడు లేచి డీఎస్సీపై వైసీపీ అధినేత విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

- మిగతా 2లో



# ధాన్యం సేకరణలో కేంద్రం ప్రేక్షకపాత్ర

- మద్దతు ధరలు ప్రకటించి మిన్నకుంటోంది
- కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల
- జొన్న,మొక్కజొన్నలను ఎంఎస్‌పి పరిధిలోకి తేవాలి

మిగతా 2లో

# సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు




- ఓపెన్ కాస్టలత విస్తరణతో సంస్థకు నష్టం
- సింగరేణి బకాయిలు 50వేల కోట్లు చెల్లించాలి
- కార్మికుల హక్కుల కోసం హెచ్ఎంఎస్‌తో కలిసి పోరాటం
- బొగ్గుబాయిబాట కార్యక్రమంలో టీఆర్ఎస్ చీఫ్ కవిత

# మోడీ నేతృత్వంలో దూసుకుపోతున్న ఇండియా

- దేశాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్న ప్రధాని
- మెడికల్ టెక్నాలజీ సహా ఆధునిక పరికరాల తయారీలో ముందంజ
- కేపిటలిస్టుల రౌండ్ టేబుల్ సమావేశంలో సిఎం చంద్రబాబు




అమరావతి,ఐఎన్‌బిటైమ్స్

ప్రధాని మోదీ దేశాన్ని అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. మెడికల్ టెక్నాలజీ సహా ఆధునిక పరికరాల తయారీలో భారత్‌ది అగ్రస్థానమన్నారు. ఎలక్ట్రానిక్స్ పరికరాలు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయని సీఎం వెల్లడించారు.

# సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో చంద్రబాబు భేటీ

టెక్నాలజీ, సెమికండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, ఎఐపై చర్చ

దాదాపు 30 నిముషాల పాటు ప్రధానితో బాబు భేటీ



# మద్యంలో వేల కోట్ల కుంభకోణం

(మొదటి పేజీ (తరువాయి)

మద్య నిషేధ హామీని తుంగలో తొక్కి, కల్తీ మద్యంతో 30 వేల మంది ప్రాణాలను గొడ్డలి పార్టీ బలితీసుకుందని ధ్వజమెత్తారు. శనివారం అమరావతి వేదికగా కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. బాబాయి హంతకులను కాపాడుతూ, న్యాయం కోరిన సొంత చెల్లికే జగన్ వెన్నుపోటు పొడిచారని ఆగ్రహించారు. విద్యుత్ ఛార్జీలను 9 సార్లు పెంచి, ప్రజలపై రూ.32 వేల కోట్ల మోయలేని భారం మోపారని దుయ్యబట్టారు. మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ హామీలను అటకెక్కించి ఐదేళ్లలో 4,100 మంది నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమయ్యారని విమర్శించారు. జీఓ నంబర్ – 117 తీసుకువచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ప్రభుత్వ స్కూళ్లను మూసివేసి, 12 లక్షల మంది భవితను అంధకారం చేశారని దుయ్యబట్టారు. బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్లను 34శాతం నుంచి 24శాతానికి కుదించి వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం చేసిన ఘనత జగన్‌దేనని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసి రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీశారని ఆగ్రహించారు. 2024 ఎన్నికల్లో 94 శాతం స్థానాలతో కూటమికి చరిత్రాత్మక విజయం అందించి.. జగన్ అరాచక పాలనకు ఏపీ ప్రజలు స్వస్తి పలికారని ప్రస్తావించారు. గత ఐదేళ్ల విధ్వంసాన్ని తుడిచేస్తూ..



రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రంలో అద్భుతమైన సంక్షేమం, ప్రగతి పథంలో ప్రయాణిస్తోందని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వ సానుకూల విధానాల వల్ల, రెండేళ్లలో దేశానికి వచ్చిన మొత్తం విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే దక్కాయని వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 65 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నామని తెలిపారు. రెండేళ్లలో తమ ప్రభుత్వంలో రూ. 65 వేల కోట్లని నేరుగా పేదలకు పంపిణీ చేశామని వెల్లడించారు.

కూటమి ప్రభుత్వ తొలి సంతకంతో మెగా డీఎస్సీలుపై ఆమోదం పొందిన తర్వాత.. 16,430 ఉపాధ్యాయ, 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేశామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మెగా డీఎస్సీపై గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం (స్త్రీ శక్తి) ద్వారా ఇప్పటివరకు 71 కోట్ల మంది మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని వెల్లడించారు. దీపం-2 పథకం కింద 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ.. ఇప్పటివరకు 4.26 కోట్ల సిలిండర్లను విజయవంతంగా అందజేశామని అన్నారు. 24 నెలల స్వల్ప వ్యవధిలోనే రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని వివరించారు. 21 లక్షల ఉద్యోగాల కల్పనకు పక్కా ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు. జగన్ హయాంలో 85శాతం హామీలను తుంగలో తొక్కితే.. కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే 90శాతం సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చిందని ఉద్ఘాటించారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఏపీ అభివృద్ధిని గొడ్డలి పార్టీ అడ్డుకుంటోందని ధ్వజమెత్తారు. గొడ్డలిపార్టీ దొంగనాటకాలు ఆడుతూ మరొకసారి ప్రజలను మోసం చేయాలని చూస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 21న నగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



విజయవాడ,జూన్13 ఈ నెల 21వ తేదీన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, యోగా దినోత్సవ వేడుకలు విజయవంతం అయ్యేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఈ నెల 21న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం ఏర్పాట్లపై శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీసు కమిషనర్ ఎం. రాజశేఖర్ బాబు, విజయవాడ మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా తదితరులతో కలిసి స్టేడియాన్ని పరిశీలించి వివిధ శాఖల అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సుమారు 5,000 మంది యోగా సాధకులు, విద్యార్థులు, ప్రజలు యోగా ఆసనాల్లో పాల్గొనేందుకు రానున్నరన్నారు. ఇందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పాల్గొనేవారికి తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మున్సిపల్, పోలీసు మరియు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక వర్షం కురిసే అవకాశం ఉంటే కార్యక్రమాన్ని అంబేద్కర్ కళావేదికలో నిర్వహించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇందుకోసం అక్కడ కూడా అవసరమైన అన్ని సౌకర్యాలను ముందస్తుగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, విద్యార్థులు, యోగా సాధకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పూర్తి చేసి, ప్రాంగణాన్ని సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నెలాఖరులోగా జలధార జలహారతి పూర్తి చేయాలి

జలధార మొదటి విడత పనులు పూర్తయిన తర్వాత చెక్ డ్యామ్‌లు, ఫామ్ పాండ్‌లు, చెరువులకు గండ్లు పడకూడదన్నారు. నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా కాలువలు, కరకట్టలలో అడ్డంకులు తొలగించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. జలధార వల్ల కలిగే లాభాలను ఇరిగేషన్, అవేర్ వంటి సంస్థలు ఎప్పటికప్పుడు అంచనా వేయాలన్నారు. జిల్లాల వారీగా భూగర్భ జలాల పునరుద్ధరణ లెక్కలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. జలధార కార్యక్రమంలో స్థానికులు, రైతులు, నీటి సంఘాలను భాగస్వాములు చేయాలని దీనికి ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని సీఎం సూచించారు. ఈ సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ద

## వీబీజీ రాంజీ స్కీం పట్ల ప్రభుత్వ నిరసన

హైదరాబాద్,జూన్13 కేంద్రం జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని తలపెట్టిన వీబీజీ రాంజీ స్కీం పట్ల నిరసన తెలపాలని తమ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తమ నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మాణం చేశామని ప్రస్తావించారు. ఈ లేఖలో పొందుపర్చాల్సిన అంశాలపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మీ, జాయింట్ కమిషనర్ నరసింహులు, ఇతర అధికారులతో ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కశనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హమీకి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం నిధులు కేంద్రం నుంచి రావాలన్నా నూతన స్కీంను అమలు చేయక తప్పదని అధికారులు సూచించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు నూతన పథకం అమలుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో నూతన పథకంపై అవలంబిస్తున్న విధానంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. నూతన పథకం అమలుపై కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కాకుండా.. నార్మెటివ్ పద్ధతిలో పని దినాలు కేటాయించే విధానాన్ని సవరించాలని కోరారు. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు ఉపాధికి బ్రేక్ ఇవ్వాలన్న క్లాజ్‌ను తొలగించాలని అన్నారు. పంట సీజన్ కాలంలో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వివరించారు. ఆ సమయంలోనే వన మహోత్సవాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను ఉపాధి హమీ ద్వారా చేపడుతామని తెలిపారు.

## తృణమూల్ పార్టీలో కొనసాగుతున్న సంక్షోభం

న్యూఢిల్లీ ,జూన్13 తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలో తలెత్తిన సంక్షోభం కొనసాగుతోంది. మరోవైపు అంతర్గత వ్యవహారాలు క్షణక్షణానికి మారుతూ ఉత్కంఠ రేపుతున్నాయి. పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి తాజాగా ఆ పార్టీ సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్ ఇచ్చారు. టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో శనివారంనాడు చేరారు. అనంతరం మరో అసమ్మతి ఎంపీ శతాబ్ది రాయ్‌తో కలిసి కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఆయన నివాసంలో కలిశారు. 19 మంది ఎంపీలతో కలిసి తమను ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని కోరేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సోమవారంనాడు కలుసుకోనున్నట్టు రెబల్స్ గ్రూప్ ప్రకటించిన నేపథ్యంలో సుదీప్ బందోపాధ్యాయ్ ఆ గ్రూపులో కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూన్ 8 నుంచి టీఎంసీ అసమ్మతి ఎంపీల సంతకాల సేకరణ చేపట్టామని, 19 ఎంపీలు సంతకాలు చేశారని రెబల్ ఎంపీ చంద్ర బర్మ బసునియా వెల్లడించారు. ఇప్పటికే ఒకసారి స్పీకర్‌ను కలిసిన

తాము ఈనెల 15న మరోసారి కలిసి తమ గ్రూపునే నిజమైన టీఎంసీగా గుర్తించాలని కోరనున్నట్టు చెప్పారు. ఓంబిర్లాను కలవడానికి ముందు టీఎంసీ రెబల్స్ న్యూఢిల్లీలో సమావేశం అవుతారని, అందులో పాల్గొనేందుకు 20 మంది ఎంపీలు న్యూఢిల్లీ చేరుకుంటారని అసమ్మతి వర్గ నేత ఒకరు చెప్పారు. కాగా, తిరుగుబాటు వర్గం వాదనను టీఎంసీ తోసిపుచ్చింది. వారి వాదనకు ఎలాంటి చట్టబద్ధత లేదని పార్టీ ఎంపీ మహువా మొయిత్ర తెలిపారు.

## రెండేళ్లలో ఆరోగ్యశాఖలో గణనీయమైన ప్రగతి

ఇది తాము చెబుతున్న మాటలు కాదని.. గణాంకాలే తమ పని తీరును చెబుతున్నాయని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారన్నారు. ఓపీ సేవల నుంచి వైద్య సేవల వరకు అన్నింటిలో సరికొత్త మార్పులు తెచ్చామని తెలిపారు. ఎవరు ఆస్పత్రికి వచ్చినా ఆ రికార్డును డిజిటల్ చేశామన్నారు. రెండేళ్లలో హెల్త్ సెక్టార్‌లో గణనీయమైన మార్పులు తెచ్చామని మంత్రి తెలిపారు. ప్రజలు ఈ సేవల ద్వారా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని గొప్పగా చెబుతున్నామన్నారు. ఇందుకు సహకారం అందజేసిన అధికారులందిరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఆరోగ్య శాఖలో కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు పని చేస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నేడు ప్రజల్లో సంతృప్తికరమైన వాతావరణం నెలకొల్పామన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా ఆరోగ్యాంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషిస్తోందని తెలిపారు. తమకు అన్ని విధాలా సహకారం అందిస్తున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఏపీలో బాధ్యతతో మెలిగే ప్రతిపక్షం లేదని.. గత ఐదేళ్ల కాలంలో జగన్ ఆరోగ్య శాఖను అనారోగ్య శాఖగా మార్చారని విమర్శించారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడం వల్ల తాము చాలా సమర్థనీయంగా పని చేశామన్నారు. తమకు ఛాలెంజింగ్ పని అప్పగించిన జగన్‌కు కూడా ధన్యవాదాలు అని అన్నారు.,÷ళిడు ఆరోగ్య శాఖలో అనేక సంస్కరణలను సీఎం చంద్రబాబు తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. రియాక్టివ్, క్యూరేటివ్ స్థాయి నుంచి ప్రిడెక్టివ్ విధానాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ముందుగానే వారి సమస్యలను గుర్తించి అవసరమైన మందులు అందిస్తున్నామని తెలిపారు. టెలిమెడిసిన్ ద్వారా ప్రజలకు ఉన్న సందేహాలను వైద్యుల ద్వారా సమాధానాలు ఇప్పిస్తున్నామని చెప్పారు. మీడియా కూడా తమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఎక్కడా ఎటువంటి సమస్య ఉన్నా... తమ దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యేలా చేశారన్నారు.

## అసలు ఓట్లు తొలగించే కుట్ర: కెటిఆర్

రాజన్న సిరిసిల్ల,జూన్13 తెలంగాణలో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. 'సర్' ప‌క్రియను బీఆర్ఎస్ సీరియస్‌గా తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈరోజు (శనివారం) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్‌లాగా దొంగ ఓట్లతో గెలవాలని తాము అనుకోమని కేటీఆర్ తేల్చిచెప్పారు.

రైతుభరోసా వేయకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ రైతన్నలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. 420 హామీలు ఇచ్చి ప్రజలను బురిడీ కొట్టించారని ఎద్దేవా చేశారు. 'సర్' పేరుతో దొంగ ఓట్లతో అసలైన ఓట్లను తొలగిస్తే చూస్తూ ఊరుకోమని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు.


## రైతుల సంక్షేమం లక్ష్యంగా కృషి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నల్గొండ,జూన్13 రైతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు. రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందని... గ్రామం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని పేర్కొన్నారు. శనివారం నల్గొండలో రాష్ట్ర సిట్రస్ సెమినార్ – 2026ను రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో కలసి మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. నల్గొండ జిల్లా పేరు చెప్పగానే బత్తాయి తోటలు గుర్తుకు వస్తాయని మంత్రి కోమటిరెడ్డి ప్రస్తావించారు. గత నాలుగు దశాబ్దాలుగా వేలాదిమంది రైతుల జీవనాధారంగా బత్తాయి సాగు చేస్తున్నారని తెలిపారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని చెప్పుకొచ్చారు. గతంలో స్వయంగా బత్తాయి సాగు చేసిన అనుభవం తనకు ఉందని వివరించారు.

గత సంవత్సరం అన్నారు. పుస్తకాల్లో ఉండే శాస్త్రీయ జ్ఞానం రైతుల పొలాల వరకు చేరినప్పుడే వ్యవసాయ రంగంలో నిజమైన మార్పు వస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

## నేడు సింగపూర్‌కు సీఎం చంద్రబాబు



అమరావతి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు సింగపూర్‌లో పర్యటించనున్నారు. 14 తేదీ ఉదయం 11.35 గంటలకు బెంగళూర్ నుంచి సీఎం సింగపూర్ బయల్దేరి వెళ్లనున్నారు. సింగపూర్ చేరుకున్న అనంతరం 15వ తేదీన సింగపూర్ కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు ఆ దేశంలోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో మొదటగా సీఎం సమావేశం అవుతారు. పర్యటనలో తొలిరోజు స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో జరిగే రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు సీఎం హాజరవుతారు. అనంతరం యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రాస్ బాచ్ తో విందు సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సింగపూర్ సీనియర్ మంత్రి లో యెన్ లింగ్‌తో సమావేశం అవుతారు. తర్వాత గూగుల్ క్లౌడ్ ఏపీఏపీ అధ్యక్షుడు కరణ్ భజ్వా, జీఐసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ అడ్వైజర్ లిమ్ సియాంగ్ గౌన్‌తో చర్చిస్తారు. వైసీహెచ్ లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాబర్ట్ యాప్‌తోనూ, నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టాన్ యెంగ్ చెయ్‌తో భేటీ అవుతారు. సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తోనూ పలు అంశాలపై చర్చిస్తారు. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తోనూ భేటీ అవుతారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందంతోనూ సమావేశం అవుతారు. హోం మంత్రి కె షణ్ముగమ్, మానవ వనరుల శాఖ మంత్రి టాన్ సీ లెంగ్‌తో చివరిగా భేటీ అవుతారు. రెండవ రోజు పర్యటనలో భాగంగా 16వ తేదీ ఉదయం కాకతీయ కల్చరల్ అసోసియేషన్ సీబీఎన్‌ఏ361ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఏపీఏసీ సెమికండక్టర్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. సుర్బానా జురాంగ్–అమరావతి ప్లానింగ్ సమావేశానికి హాజరవుతారు. అనంతరం సింగపూర్ ఉప ప్రధానమంత్రి, వాణిజ్య మంత్రి గాన్ కిమ్ యాంగ్ బృందంతో సమావేశం అవుతారు. తర్వాత 'వరల్డ్ సిటీస్ సమ్మిట్' లీడర్షిప్ ప్లీనరీలో పాల్గొని ప్రసంగిస్తారు. తర్వాత వరల్డ్ సిటీస్ సమ్మిట్ ఎగ్జిబిషన్ సందర్శిస్తారు. సింగపూర్ పెవిలియన్, ఇన్నోవేటర్ల అలయ్, గూగుల్ టెక్నాలజీస్ స్టాల్స్ ప్రధానంగా పరిశీలిస్తారు.

సీట్రియమ్ సమావేశంలోనూ పాల్గొంటారు. పర్యటనలో చివరిగా సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ 2026 బిజినెస్ రోడ్ షోలో పాల్గొంటారు. సింగపూర్ పర్యటనకు ముఖ్యమంత్రి వెంట పురపాలక శాఖ మంత్రి నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఈడీబీ సీఈఓ షన్మోహన్, సీఆర్డీఏ అధికారుల బృందం కూడా వెళ్లనుంది. రాజధాని అమరావతి నిర్మాణ ప్రాజెక్టులు సహా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు సీఎం బృందం సింగపూర్ లో పర్యటించనుంది. 16 తేదీ రాత్రి 10 గంటలకు ముఖ్యమంత్రి స్వదేశానికి తిరిగి రానున్నారు.

# ఇరాన్‌తో శాంతి ఒప్పందంతో మార్కెట్లో మళ్లీ జోరు

## అమాంతంగా పెరిగిన బంగారం, వెండి ధరలు

న్యూఢిల్లీ,జూన్15
దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండికి మళ్లీ గిరాకీ పెరిగింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు దిగిరావడం, రూపాయి విలువ బలోపేతం వంటి కారణాలతో ఈ లోహాల ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఇరాన్‌తో డీల్ కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో మూడు నెలలకు పైగా సాగిన యుద్ధానికి ముగింపు లభించినట్లయ్యింది. ఈ పరిణామాలతో ముడి చమురు ధరలు భారీగా దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ 83 డాలర్లకు పడిపోయింది. అటు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 53 పైసలు బలపడి 93.65 వద్ద ట్రేడ్ అవుతోంది. సోమవారం హైదరాబాద్ లో 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,490 పలికింది. అటు వెండి ధర కూడా ఎగబాకింది. కేజీ వెండి ధర రూ.2.57లక్షలకు చేరింది. గతవారం ఒకదశలో బంగారం ధర రూ.1,50,000 కన్నా దిగువకు పడిపోయిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ విపణిలోనూ బంగారం, వెండికి డిమాండ్ పెరిగింది. స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 4,323 డాలర్లు, ఔన్సు వెండి ధర 70.38 డాలర్లకు చేరింది. గతవారం పసిడి ధర ఒక దశలో దాదాపు 4000 డాలర్లకు తగ్గింది. ఇక, కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.1,53,258గా ఉంది. వెండి ఫ్యూచర్స్ ధర రూ.2,52,383గా ట్రేడ్ అవుతోంది.




## స్కూలు బస్సులను తనిఖీ చేసిన అధికారులు

హైదరాబాద్,జూన్15 తెలంగాణలో పాఠశాలలు తెరుచుకున్న నేపథ్యంలో విద్యాసంస్థల బస్సులను రవాణాశాఖ అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఇవాళ వెయ్యికిపైగా స్కూల్ బస్సులను ఆర్టీఏ అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన 150కిపైగా బస్సులపై కేసు నమోదు చేశారు. ఫిట్‌నెస్ లేని 35 విద్యాసంస్థల వాహనాలను సీజ్ చేశారు.

# తెలంగాణ వ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకం

### రాజ్‌భవన్ స్కూల్‌లో ప్రారంభించిన మంత్రి పొన్నం

హైదరాబాద్,జూన్15 తెలంగాణ వ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకం ప్రారంభమైంది. సోమవారం ఉదయం రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం పథకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసిన మంత్రి.. వారికి పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించే విధంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వ స్కూల్లో చదివితేనే ప్రభుత్వ పథకాలు అందుతాయనే రోజులు రానున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాలు కావాలి కానీ ప్రభుత్వ ఆసుపత్రులు, స్కూల్ వద్దు అనే భావన ఉందన్నారు. దాన్ని తొలగించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు రూ.800 కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కలెక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




ఐ ఎన్ బి టైమ్స్ నందిగామ జూన్ 15:
రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఎల్ఓ ఆఫీస్ వద్ద ధర్నా పిలుపుల భాగంగా నందిగామ లేబర్ ఆఫీస్ వద్ద బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది.
ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కె. గోపాల్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా 2019 వరకు ఉన్న పథకాలన్నీ అమలు చేయాలి .పెండింగ్ లో ఉన్న క్లెయిమ్స్ పరిహారాలు వెంటనే చెల్లించాలి సంక్షేమ బోర్డులో సభ్యునిగా చేరటానికి/రెన్యువల్ చేసుకోవడానికి పథకాలు దరఖాస్తు చేసుకోవడానికి ఆన్లైన్ తో పాటు గతంలాగే ఆఫ్ లైన్ లో తీసుకోవాలి గతంలో కార్డులో ఉన్న వారికి ఎలాంటి షరతులు లేకుండా రెన్యువల్ చేయాలి సంక్షేమ బోర్డును నిర్మాణ కార్మికులకు మరింత ప్రయోజనంకరంగా ఉపయోగపడేలా పథకాలను సులభతరం చేయాలి
ఈ కార్యక్రమంలో కంచికచర్ల సిఐటియు జి గోపినాయుక్, బిల్డింగ్ వర్కర్ యూనియన్ నాయకులు షేక్ హుస్సేన్, చందర్లపాడు మండల కార్యదర్శి తోటరామారావు, నందిగామ నియోజకవర్గం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీ పత్తి హరి, షేక్ బాజీ, రాంబాబు, రాము,కట్టికల సురేష్, పుల్లయ్య,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మోగిన బడిగంటలు

- రాష్ట్రవ్యాప్తంగా తెరుసుకున్న స్కూళ్లు
- మళ్లీ రెఓడ్డెక్కిన బస్సులు, ఆటోలు
- కొన్నిచోట్ల విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు



హైదరాబాద్,జూన్15 వేసవి సెలవులు ముగియడంతో సోమవారం స్కూళ్లు పునఃప్రారంభం అయ్యాయి. ఇన్నాళ్లు ఇంటికే పరిమితం అయిన విద్యార్థులు మళ్లీ బడిబాట పట్టారు. ఉదయమే మళ్లీ ఆటోలు, బస్సులు రయ్‌మంటూ రోడ్లపైకి వచ్చాయి. స్కూల్లను ముస్తాబు చేయడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ స్కూళ్లకు చేరారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు తెరుచుకున్నాయి. దీంతో విద్యార్థులు బడిబాట పట్టారు. పాఠశాలలకు తొలిరోజు వస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. అల్పాహారం ఏర్పాటు చేశారు. ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. వేసవి సెలవులతో బోసిపోయిన పాఠశాలలు సందడిగా మారాయి. తెలంగాణలో పాఠశాలలు తెరచుకోవడంతో తల్లిదండ్రులు మళ్లీ బిజీ అయ్యారు. కొత్త పుస్తకాలు.. ఏకరూప దుస్తులతో బడులకు వెళ్లే చిన్నారులతో సందడి నెలకొంది. ఈసారి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కొత్తగా అల్పాహారాన్ని అందించనున్నారు. తొలి రోజే పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే అమావాస్య రోజు పాఠశాలలు రీఓపెన్ కావడంతో మొదటి రోజు హాజరు శాతం భారీగా తగ్గింది.
రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్కూళ్లలో చాలా తక్కువ మంది విద్యార్థులపై హాజరయ్యారు. కొన్ని చోట్ల పదుల సంఖ్యలోనే విద్యార్థులు హాజరవ్వగా.. ఇక రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం గీతానగర్‌లోని బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఒక్కతే పాఠశాలకు వచ్చింది. తోటి క్లాస్‌మేట్స్ ఎవరూ లేకపోవడంతో ఆ విద్యార్థిని ఒంటరిగానే క్లాస్ రూంలో కూర్చుంది.
ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ పునఃప్రారంభ తేదీ అమావాస్య రోజు రావడంతో కొందరు అశుభంగా భావిస్తున్నారు. ఈ రోజున కొత్త పనులు, చదువులు ప్రారంభించడం మంచిది కాదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. తెల్లవారి౼ంపుదామంటే మంగళవారం అవుతుండడంతో ఈ రెండు రోజులు పిల్లలను ఇంటి వద్దే ఉంచాలని వారు ఆలోచిస్తున్నారు. దీంతో ఈ రోజుల్లో విద్యార్థుల హాజరు తగ్గే అవకాశం ఉంది. కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ముందుగానే అమావాస్యను ఆలోచించి ఈ నెల 17న బుధవారం, 19న శు క్రవారంప్రారంభించేందుకునిర్ణయించాయి.

## నగరశివారులో డ్రగ్స్ తయారీ గుట్టు రట్టు

హైదరాబాద్,జూన్ 15 హైదరాబాద్ నగర శివారులోని అబ్దుల్లా పూర్‌మెట్‌లో అత్యంత ప్రమాదకరమైన ఎండీఎంఏ డ్రగ్స్ తయారు చేస్తున్న ముఠా గుట్టును ఈగల్ టీం రట్టు చేసింది. సోమవారం డ్రగ్స్ తయారు చేస్తున్న నరేష్, మత్స్యగిరిలను ఈగల్ టీం అరెస్ట్ చేసింది. ఈ ముఠాలో సంతోష్ సింగ్ అలియాస్ రాజు అలియాస్ రాజేష్, విజయ్, అశ్విని పాఠక్ కీలక సభ్యులుగా ఉన్నారని ఈగల్ టీం తెలిపింది. అలాగే రూ.50 లక్షల విలువైన మెఫెడ్రోన్‌తోపాటు రసాయనాలను స్వాధీనం చేసుకుంది. రూ.50 లక్షల విలువైన ఆ ఫ్యాక్టరీని సీజ్ చేసింది. నరేష్, కీసర మత్స్యగిరిలు గత కొన్ని సంవత్సరాలుగా తప్పించుకుని తిరుగుతున్నారని ఈగల్ టీం వెల్లడించింది. రసాయన శాస్త్రవేత్త నుంచి అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా సభ్యులుగా వీరు ఎదిగారని తెలిపింది. గతంలో వీరు హత్యలు, దోపిడీలతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని వివరించింది. చివరకు వీరు డ్రగ్స్ తయారీదారులుగా మారారని తెలిపింది. అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్‌లో ఈ ముఠా కీలకంగా వ్యవహరిస్తుందని వెల్లడించింది. గత ఆరు నెలలుగా వీరి కోసం గాలిస్తున్నామని చెప్పింది. 2015 నుంచి దేశవ్యాప్తంగా అక్రమ డ్రగ్స్ తయారీ కేంద్రాలను ఈ ముఠా ఏర్పాటు చేసి.. తన కార్యకలాపాలు కొనసాగిస్తుందని ఈగల్ టీం వివరించింది.

## అమెరికా మిస్సోరిలో కుప్పకూలిన విమానం

### ప్రమాదంలో 12 మంది దుర్మరణం

వాషింగ్టన్,జూన్15 అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో ఓ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న 12 మంది చనిపోయారు. స్కైడైవింగ్ చేసే వారిని తీసుకెళ్తుండగా బట్లర్ మెమోరియల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఈదుర్ఘటన జరిగింది.
ప్లేన్ టేకాఫ్ అయిన తర్వాత రన్‌వేకు సుమారు 300 గజాల దూరంలో క్రాష్ అయింది. చనిపోయిన వారిలో 11 మంది స్కైడైవర్లు, ఒక పైలట్ ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందం

### స్వాగతిస్తూ ఎక్స్ వేదికగా మోడీ ప్రకటన




న్యూఢిల్లీ,జూన్15 అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై భారత ప్రధాని నరేంద్రమోదీ స్వాగతించారు. ఉద్రిక్తతలను ముగించేందుకు ఇరుదేశాలు ఓ అంగీకారానికి రావడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో మోదీ పోస్ట్ చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడింది. ఎన్నో దేశాల్లో ప్రాణనష్టం వాటిల్లింది. ఈ యుద్ధాన్ని ముగించేలా అమెరికా, ఇరాన్ అంగీకారం కుదుర్చుకోవడం స్వాగతించే విషయం. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాలను పునరుద్ధరించడం, స్వేచ్ఛా నౌకాయానం, వాణిజ్యానికి భరోసా కల్పించడంలో ఈ పరిణామం సాయపడుతుందని భారత్ విశ్వసిస్తోంది.
సుస్థిరమైన తుది ఒప్పందానికి దారితీసేలా.. మిగిలిన అంశాల పైనా సానుకూల చర్చలు జరుగుతాయని విశ్వసిస్తున్నాం అని మోదీ రాసుకొచ్చారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేలా ఇరాన్‌తో ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీన్ని టెహ్రాన్ కూడా ధ్రువీకరించింది. దీనిపై స్విట్జర్లాండ్ వేదికగా జూన్ 19న ఇరుదేశాలు సంతకాలు చేయనున్నాయి. హర్మూజ్‌లో అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని తొలగించడం, ఈ జలసంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ చమురుపై ఆంక్షలు తదితర అంశాలపై ఇరుదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలిసింది.

# సినీ నటికి వేధింపులు

### క్యాస్టింగ్ ఆర్టిస్ట్‌పై కేసు నమోదు




హైదరాబాద్,జూన్15 సినిమా అవకాశాల పేరుతో ఓ నటిని వేధించడమే కాకుండా, రావాల్సిన పారితోషికం ఇవ్వకుండా మోసం చేసిన క్యాస్టింగ్ ఆర్టిస్ట్ ప్రసాద్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. 'ఆకాశంలో ఒక తార' సినిమాలో నటింపజేసినందుకు గానూ సదరు నటికి ఇవ్వాల్సిన రూ.90 వేల పారితోషికం, రూ.38 వేల ప్రయాణ ఖర్చులను ఇవ్వకుండా నిందితుడు కాలయాపన చేశాడు.
ఈ క్రమంలోనే గత ఫిబ్రవరిలో బంజారాహిల్స్‌కు పిలిపించి, బకాయిలు ఇవ్వకుండా బెదిరించడమే కాకుండా.. బలవంతంగా కారులో ఎక్కించుకుని మరిన్ని అవకాశాలు ఇస్తానంటూ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. భయంతో అక్కడి నుంచి వెళ్ళిపోయిన బాధితురాలు జరిగిన విషయాన్ని తల్లికి చెప్పగా, ఆమె నిందితుడిని ఫోన్ లో నిలదీసింది. అయితే ఆమెను సైతం నిందితుడు దుర్భాషలాడి బెదిరించడంతో, బాధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# నెల్లూరు జిల్లా సంగం మండలంలో విషాద ఘటన

### విశ్రాంత ఉపాధ్యాయుడి కుటుంబం ఆత్మహత్య

నెల్లూరు,జూన్15 నెల్లూరు జిల్లా సంగం మండలంలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. మండల పరిధిలోని దువ్వూరు గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తమ ఇంట్లోనే ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతులను విశ్రాంత ఉపాధ్యాయుడు మధుసూదన్‌రావు, ఆయన భార్య రత్నావళి, మరియు వారి కుమారుడు సాయి సుకృత్‌గా పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పరిశీలించి, స్వాధీనం చేసుకున్నారు. చేతులకు తాళ్లు కట్టేసి ఉండటంతో మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనాస్థలిలో సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పూర్తి వివరాల కోసం విచారణ జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# కరుప్పు విజయంతో మరింత బిజీగా త్రిష

రెమ్యునరేషన్ కూడా పెంచినట్లు టాక్

సౌత్ సినీ ఇండస్ట్రీలో రెండు దశాబ్దాలకు పైగా తన స్టార్‌డమ్‌ను నిలబెట్టుకున్న హీరోయిన్ త్రిష మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం ఆమె రెమ్యూనరేషన్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వరుస విజయాలతో కెరీర్‌లో మళ్లీ బిజీ అయిన త్రిష, కొత్త సినిమాల కోసం తన పారితోషికాన్ని పెంచినట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. త్రిష కెరీర్‌ను పరిశీలిస్తే ఎన్నో



విజయాలతో పాటు కొన్ని పరాజయాలు కూడా ఎదురయ్యాయి. అయితే ప్రతిసారి చిన్న విరామం తర్వాత ఆమె మరింత బలంగా తిరిగి వచ్చి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇదే కారణంగా ఆమెను సౌత్ ఇండస్ట్రీలో అత్యంత నిలకడైన హీరోయిన్లలో ఒకరిగా భావిస్తారు. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించకపోయినా, తాజాగా కరుప్పు వంటి భారీ హిట్‌తో త్రిష మార్కెట్ మళ్లీ ఊపందుకుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆమె కెరీర్‌లో మరో గోల్డెన్ ఫేజ్ నడుస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పెద్ద హీరోల సరసన అవకాశాలు రావడం, పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పెరగడం, ప్రేక్షకుల్లో ఇప్పటికీ మంచి ఆదరణ ఉండటం ఆమె క్రేజ్‌కు ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. యువ హీరోయిన్ల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ, తన అనుభవం, నటన, స్క్రీన్ ప్రెజెన్స్‌తో త్రిష ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తున్నారు. అందుకే నిర్మాతలు ఇప్పటికీ ఆమెను తమ ప్రాజెక్టుల్లో భాగం చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని సమాచారం. ఇటీవల విడుదలైన కరుప్పు చిత్రం విజయంతో త్రిషకు కొత్త అవకాశాలు మరింత పెరిగినట్లు టాక్ వినిపిస్తోంది.

# సల్మాన్‌తో రాజ్ నిడుమోరు చిత్రం





ది ఫ్యామిలీ మ్యాన్', 'ఫర్జీ' వంటి సూపర్ హిట్ సిరీస్‌లకు దర్శకత్వం వహించిన రాజ్ నిడిమోరు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ సినిమాకు సిద్ధమవుతున్నారు. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో రాజ్ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 'ఒక హాలీవుడ్ సినిమా స్క్రిప్ట్ ఇప్పుడే మొదలైంది, అది ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది. మరో సిరీస్ కూడా అభివృద్ధి దశలో ఉంది. మా హిందీ సినిమా నిర్మాణం త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను దృష్టిలోపెట్టుకొని, భారీ బడ్జెట్‌తో ఈ సూపర్ సినిమా రూపొందిస్తున్నారు. అక్టోబర్‌లో ఈ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తారని సమాచారం. అయితే ఈ విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. గతంలోనూ ఈ సినిమా గురించి వార్తలు ప్రచారమయ్యాయి. ఈ చిత్రంలో రాజ్ భార్య సమంత హీరోయిన్‌గా నటించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. అయితే, వాటిని రాజ్ సన్నిహిత వర్గాలు కొట్టిపారేశాయి. ఇక, సల్మాన్ ప్రస్తుతం దర్శకుడు వంశీ పైడిపల్లి, నిర్మాత దిల్‌రాజు కాంబినేషన్‌లో వస్తున్న మూవీలో షూటింగ్‌లో బిజీగా ఉన్నారు.

# నాగార్జునతో చేతులు కలపనున్న అనిల్



టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి మరో ఆసక్తికరమైన కాంబినేషన్‌కు సిద్ధమవుతున్నాడని, తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు చూస్తే అక్కినేని నాగార్జునతో సినిమా దాదాపు ఖాయమైనట్లే కనిపిస్తోంది. ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అనిల్ రావిపూడి తన కెరీర్‌లో ఇప్పటికే పలువురు అగ్ర హీరోలతో కలిసి బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించారు. ముఖ్యంగా సీనియర్ స్టార్ హీరోలైన మెగాస్టార్ చిరంజీవి, నటసింహం బాలకృష్ణ, విక్టరీ వెంకటేష్‌లతో సినిమాలు చేసి విజయాలు సాధించారు. దీంతో టాలీవుడ్‌లో ఒకే తరం నలుగురు అగ్ర హీరోలతో పనిచేసే అరుదైన అవకాశానికి ఆయన మరింత చేరువయ్యారు. గతంలో నాగార్జున-అనిల్ రావిపూడి కాంబినేషన్‌పై అనేక వార్తలు వచ్చినప్పటికీ అవి ప్రచారాలుగానే మిగిలిపోయాయి. అయితే తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు మరోసారి ఈ కాంబినేషన్‌ను వార్తల్లోకి తెచ్చాయి. ఒక షో ప్రమోషన్స్ సందర్భంగా సీనియర్ నటి రాధ మాట్లాడుతూ,నేను చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జునలతో సినిమాలు చేశాను అని చెప్పగా, వెంటనే స్పందించిన అనిల్ రావిపూడి చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్‌లతో తాను చేసిన సినిమాల పేర్లను ప్రస్తావించారు.



# పెద్ది కలెక్షన్ల దూకుడు

**మొత్తం రూ.307.98 కోట్ల గ్రాస్ కలెక్షన్లు**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతూ వసూళ్ల పరంగా కూడా సత్తా చాటుతోంది. మొదటి వారం తర్వాత వీక్‌డేస్‌లో కొంత మందగించిన కలెక్షన్లు, రెండో వీకెండ్‌లో మళ్లీ ఊపందుకోవడం విశేషం. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, విడుదలైన 11వ రోజు ఆదివారం 'పెద్ది' మరోసారి బలమైన ప్రదర్శన కనబరిచింది. దేశవ్యాప్తంగా సుమారు 4,133 షోల ద్వారా రూ.9.20 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించినట్లు సమాచారం. దీంతో భారతీయ బాక్సాఫీస్ వద్ద 11 రోజుల్లో ఈ చిత్రం రూ.216 కోట్ల నెట్, రూ.256.23 కోట్ల గ్రాస్ వసూళ్లను నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'పెద్ది' మంచి స్పందనను అందుకుంటోంది. విదేశీ మార్కెట్లలో ఇప్పటివరకు సుమారు రూ.51.75 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ రిపోర్ట్స్ చెబుతున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా మొత్తం రూ.307.98 కోట్ల గ్రాస్ కలెక్షన్లను తన ఖాతాలో వేసుకున్నట్లు సమాచారం. మరోవైపు చిత్ర బృందం మాత్రం మొత్తం వసూళ్లు రూ.393 కోట్లకు చేరుకున్నాయని ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి సుమారు రూ.195.30 కోట్ల గ్రాస్ వసూళ్లు నమోదైనట్లు సమాచారం. ఇది సినిమా విజయానికి కీలకంగా మారిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు.రెండో వీకెండ్‌లో కలెక్షన్లు మళ్లీ జోరందుకోవడంతో 'పెద్ది' మరిన్ని రికార్డుల దిశగా పయనిస్తోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఫుల్ రన్ ముగిసే నాటికి రామ్ చరణ్ కెరీర్‌లోనే అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# వెంకటేశ్, కళ్యాణ్ రామ్ కాంబో

## మరో సినిమా ప్లాన్ చేస్తున్న అనిల్ రావిపూడి

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి మరో భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ముఖ్యంగా సంక్రాంతి సీజన్‌లో ఆయన సినిమాలకు ప్రత్యేక క్రేజ్ ఏర్పడింది. 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి వరుస విజయాల తర్వాత అనిల్ రావిపూడి ఇప్పుడు విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్‌లతో కలిసి ఓ క్రేజీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే వెంకటేష్‌తో 'ఎఫ్2', 'ఎఫ్3' వంటి విజయవంతమైన చిత్రాలు అందించిన అనిల్, కళ్యాణ్ రామ్‌తో తన తొలి చిత్రం 'పటాస్' ద్వారా సూపర్ హిట్ అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరు హీరోలను ఒకే సినిమాలో చూపించబోతుండటంతో ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రీ-ప్రొడక్షన్ పనులు కూడా దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయని సమాచారం. పూర్తి స్థాయి యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సినిమా టైటిల్‌కు సంబంధించి ఆసక్తికరమైన ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పండుగ వాతావరణం, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్, అనిల్ రావిపూడి స్టైల్ కామెడీకి సరిపోయేలా ఈ చిత్రానికి 'సంక్రాంతి సరుకు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ టైటిల్ మాస్, ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'సింగీతం' గోల్డెన్ బ్లాక్‌బస్టర్ ఈవెంట్‌లో అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్‌గా మారాయి. ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన ఈ చిత్ర విజయోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, నిర్మాత నాగ్ అశ్విన్‌పై ప్రశంసలు కురిపించారు. సాధారణంగా మేము ట్రైలర్లు, ప్రమోషన్లతో సినిమాపై హైప్ క్రియేట్ చేయడానికి చాలా కష్టపడతాం. కానీ నాగ్ అశ్విన్ మాత్రం ట్రైలర్ లేకుండానే సినిమాను విడుదల చేసి విజయం సాధించారు. ఆ ఫార్ములా నాకు బాగా నచ్చింది. ఇకపై నా సినిమాలకు కూడా ట్రైలర్లు కట్ చేయను అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.

